
ప్రజాశక్తి
శనివారం 15 మార్చి 2025 | 5 | విజయనగరం



నేడు జిల్లా ప్రత్యేకాధికారి బాబు రాక

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమలుపై పర్యవేక్షణ చేసే నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు నియమించిన ప్రత్యేక అధికారి, సీనియర్ ఐఎఎస్ అధికారి, రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ అహ్మద్ బాబు శనివారం జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ తెలిపారు. ఆయన ఉదయం 10 గంటలకు జిల్లాకు చేరుకొని స్వచ్ఛంధ్ర కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. 10-30 గంటలకు కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో నిర్వహించే సమావేశంలో పాల్గొని జిల్లాలో ప్రభుత్వ పథకాలు అమలు, ఆదాయ ఆర్జన శాఖల ద్వారా ప్రభుత్వ ఆదాయం పెంపుదల లో సాధించిన ప్రగతి తదితర అంశాలపై సమీక్షిస్తారని పేర్కొన్నారు.

అరకొర సాయం.. ముంచుకొస్తున్న సమయం

- అదనపు సాయం అంతంతే
- మార్చి 31తో ముగియనున్న గడువు
- ఆందోళనలో ఇళ్ల లబ్ధిదారులు

ముందుకెళ్తే నుయ్యి... వెనక్కపోతే గొయ్యి అన్న చందంగా ఉంది జిల్లాలో ఇంటి నిర్మాణ లబ్ధిదారుల పరిస్థితి. అరకొరగానైనా అదనపు సాయం అందుతుందని సరదా పడాలో... లేక పట్టుమని పదిహేను రోజుల్లో ఇంటి నిర్మాణ పనులు పూర్తిచేసుకోలేక అవస్థలు పడాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. పెరిగిన గృహ నిర్మాణ సామగ్రి ధరలతో పోలిస్తే ప్రభుత్వం పెంచిన సాయం ఏమూలకూ సరిపోదని కూడా లబ్ధిదారుల నుంచి వినిపిస్తోంది.



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

గత ప్రభుత్వ హయాంలో పిఎంఇవై (ప్రధానమంత్రి ఆవాస్ యోజన -గ్రామీణ్, అర్బన్, పిఎం జన్‌మన్ పథకాల ద్వారా ఇళ్లు మంజూరుచేసిన సంగతి తెలిసిందే. ఇంటికి రూ.1లక్షా 80వేలు మాత్రమే మంజూరు చేశారు. దీంతో, చాలా సగానికి సగం మంది ఇంటి నిర్మాణానికి ముందుకు రాలేదు. ప్రభుత్వమే ఇళ్లు కట్టించి, తాళాలు అందజేస్తుందని చెప్పడంతో ఈ పద్ధతిని కొందరు ఎంచుకున్నారు. మొత్తానికి ఇంటి నిర్మానానికి ఈ సొమ్ము ఏమాత్రం సరిపోయే పరిస్థితి లేకపోవడంతో పూర్తిచేసిన ఇళ్లు 40శాతానికి మించలేదు. 30శాతం ఇళ్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో నిలిచిపోగా, మిగిలిన 30శాతం ప్రారంభానికి కూడా నోచుకోలేదు. మరోవైపు ఈ పథకాల కాలపరిమితి ఈ నెల 31వ తేదీతో ముగిసిపోనుండడంతో ఆ తరువాత బిల్లులు నిలిచిపోతాయని అధికారులు చెబుతున్నారు. కేవలం 15రోజుల్లో ఇంటి నిర్మాణం పూర్తిచేయడం ఎలా సాధ్యమౌతుందని లబ్ధిదారులు తీవ్ర ఆందోళనతో ఉన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో నిర్మాణ పనులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో బిసి, ఎస్‌సిలకు రూ.50వేలు, ఎస్‌టిలకు రూ.75 వేలు, పివిటిజిల (ఆదిమ తెగలు) కు రూ.1 లక్ష వంతున అదనపు సాయం ప్రకటిస్తూ ప్రభుత్వం ఈనెల 10వ తేదీన జిఒ నెంబర్ 9 విడుదల చేసిన సంగతి తెలిసిందే. అయితే, పెరిగిన సిమెంట్, ఇసుక, ఇనుము, భవన నిర్మాణ కూలీలు రేట్లను బట్టి అది ఏమాత్రం సరిపోని పరిస్థితి. పెంచిన సాయంతో కలిపి బిసి, ఎస్‌సిలకు రూ.2.30లక్షలు, ఎస్టీలకు రూ.1.55లక్షలు, పిటిజిలకు రూ.2.80లక్షలు మాత్రమే. వాస్తవానికి రెండు సెంట్ల స్థలంలో ఒక ఇంటి నిర్మాణం చేపట్టాలంటే రూ.7 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెట్టుబడి అవుతుందని భవన నిర్మాణ కార్మికులు, కాంట్రాక్టర్లు చెబుతున్నారు. పిటిజిలు కొండకోనల్లోకి మెటీరియల్ తీసుకెల్లడం అంటే మాటలు కాదు. ఈలెక్కన లబ్ధిదారులు తక్కువలో తక్కువగా కనీసం రూ.5లక్షల వరకు తమ వాటాగా పెట్టుకోవాల్సివుంటుంది. ఏదోలా ముందుకు సాగుదామనుకున్నవారికి కూడా సమయం పెద్దగా లేదు. కేవలం 16రోజులు మాత్రమే సమయం ఉంది. ఈనేపథ్యంలో పథకం రద్దుకాకుండా సమయం పెంచాలని కొందరు, యూనిట్ విలువ ఇంకా పెంచితే తప్ప నిర్మాణాలు చేపట్టలేమని మరికొందరు లబ్ధిదారులు కోరుతున్నారు.

విజయనగరంలో..

ఒసిల సంగతి కాస్త అటుంచితే ప్రభుత్వం సాయం ప్రకటించిన బిసి, ఎస్‌సి, ఎస్‌టి, పివిటిజిలకు చెందిన 15,226 మంది లబ్ధిదారులు తమ ఇళ్లను కట్టుకోలేక ప్రారంభించకపోవడం, మధ్యంతరంగా ఆపేయడం వంటి దశలో ఉండిపోయారు. వీరిలో 12,240 మంది బిసిలు, 2,231 మంది ఎస్సీలు, 565 మంది ఎస్టీలు, 190 మంది ఆదిమతెగలవారు ఉన్నారు.

పార్వతీపురం మన్యంలో..

పార్వతీపురం మన్యం జిల్లాలో 10, 717 ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయినట్టు అధికారులు చెబుతున్నారు. వీటిలో 4109 బిసి, 1169 ఎస్సీ, 3073 ఎస్టీ, 2366 పిటిజి లబ్ధిదారులు ఉన్నారు. వీరందరికీ ఇప్పటికిప్పుడే ఏం చేయాలో అర్థ కాని పరిస్థితి నెలకుంది. మరోవైపు ఈ నెల 18 నుంచి 22 వరకు ఇళ్ల నిర్మాణాల వద్దకు గ్రామ, వార్డు సచివాలయ ఇంజినీరింగ్, సంక్షేమ కార్యదర్శులు వెళ్లి వాటిని ఫోటోలు తీసి హౌసింగ్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తారని అధికారులు చెబుతున్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపాలి

- ప్లాంట్ ప్యాకేజీ నిధులు కార్మికుల జీతాలకు కేటాయించాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని
- ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద రాస్తారోకో



విజయనగరంలో రాస్తారోకోను ఉద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేయాలని, ప్లాంట్‌కు కేంద్రప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీ నిధులు కార్మికుల జీతాలకు కేటాయించాలని, సొంత గనులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట సమితి పిలుపు మేరకు శుక్రవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణకు 4 సంవత్సరాలుగా కార్మికులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా మోసపూరిత ప్రకటనలు చేస్తున్నాయని అన్నారు. సొంత గనులు లేక స్టీల్ ప్లాంట్ ఆర్థికంగా ఇబ్బంది పడుతుంటే నష్టాలకు కార్మికుల్ని బాధ్యులను చేస్తూ ప్లాంట్ నిర్వీర్యానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని మండిపడ్డారు. 4 వేల మంది కాంట్రాక్ట్ కార్మికుల జీతాలు నిలుపుదల చేశారని , కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీ నిధులతో తక్షణమే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు, ఉత్తరాంధ్రాకు కీలక పరిశ్రమంగా ఉన్న స్టీల్ ప్లాంట్ ను బలహీనపరిచి పక్కనే అనకాపల్లిలో మిట్టల్ సంస్థతో ప్రైవేట్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు కేంద్రం అనుమతిలిస్తే ఇక్కడి కూటమి ప్రభుత్వం మద్దతు తెలియజేస్తుందని ధ్వజమెత్తారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే విశాఖ స్టీల్ ప్లాంట్ ను సెయిల్‌లో విలీనం చేసే విధంగా కేంద్రంపై ఒత్తిడి తేవాలని, అఖిలపక్షం, కార్మిక సంఘాలతో కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించాలని లేదంటే పోరాటం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం. శ్రీనివాస, జిల్లా కార్యదర్శి ఎ. జగన్మోహన్‌రావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాము, సిహెచ్ వెంకటేష్, డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ హరీష్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆనంద్, సిఐటియు నాయకులు పాపారావు, రాఘవ, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు .

బొబ్బిలి : విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ప్యాకేజీ మోసపూరితమని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకపు నిర్ణయాన్ని రద్దు చేయాలని బొబ్బిలి చర్చి సెంటర్లో సిఐటియు ఆధ్వర్యాన శుక్రవారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలో ఉన్న పార్టీలు ప్రధాని మోడీకి అమ్ముడుపోయి ఉత్తరాంధ్రకు తీవ్రమైన ద్రోహం చేస్తున్నాయని విమర్శించారు. రూ.3 లక్షల కోట్లు విలువచేసే విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్పొరేట్లకు కారుచౌకగా అమ్మడం అన్యాయమన్నారు. స్టీల్‌ప్లాంట్ అమ్మకానికి వ్యతిరేకంగా చేపట్టే పోరాటాల్లో ప్రజలు కలిసి రావాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ నాయకులు జి.శంకర్రావు, భాస్కర రావు, ఎస్ఎఫ్ఐ నాయకులు మణి కుమార్, కిరణ్, కార్మికులు పాల్గొన్నారు.



బొబ్బిలిలో రాస్తారోకో చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

భూముల సర్వేకు ఆర్‌డిఒ ఆదేశం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని గదబవలస భూములకు పట్టాలివ్వాలని సిపిఎం ప్రజాచైతన్యయాత్ర సందర్భంగా చేపట్టిన ఆందోళన నేపథ్యంలో ఆర్‌డిఒ దాట్ల కీర్తి స్పందించారు. శుక్రవారం గదబవలస చేరుకొని సిపిఎం నాయకులు చల్లా జగన్‌తో మాట్లాడారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ స్వాతంత్ర్య కాలం నుంచి ఇనాం భూములను, రెవిన్యూ భూములను సుమారు 35 కుటుంబాలు సాగు చేసుకుంటున్నప్పటికీ నేటికీ ఒక్కరికి కూడా పట్టాలు ఇవ్వలేదని తెలిపారు. ఆర్‌డిఒ స్పందిస్తూ ఇనాం భూములకు వేరుగా, ఇనాం భూములకు వేరుగా సర్వే చేయించాలని తహశీల్దార్‌కు ఆదేశాలిచ్చారు. సర్వే పూర్తయిన వెంటనే ప్రభుత్వంతో మాట్లాడి పట్టాలు ఇచ్చేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు ఆర్‌డిఒ వెంట డిప్యూటీతహశీల్దార్,


గదబవలసలో భూములను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ కీర్తి



ఒకప్పుడు ఈ ఫొటోలో కనిపిస్తున్న దృశ్యమంతా పెద్దకొండతో నిండిన ప్రాంతం. కానీ పదేళ్ల కాలంలో కొండను పూర్తిగా తవ్వేసి లోతైన లోయలాగా మార్చేసిన పరిస్థితి. ఏళ్ళు తర్వాత గ్రామానికి వచ్చిన వారికి ఇక్కడ కొండ ఏమైందన్న ప్రశ్న తలెత్తక మానదు. ఇంతకీ కొండను తినేసిన బాపతు లెవరు? అంటే చటుక్కున గుర్తొచ్చేది మైనింగ్ మాఫియా అనక తప్పదు. అయితే కొండలు తినేసిన తర్వాత కూడా అక్రమ మైనింగ్ ఆగడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కానీ సామాన్యులు చేసే క్వారీ పనులపై మైన్స్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు.

కొండను తవ్వేశారు

- పేదల క్వారీలపైనే మైన్స్ నిఘా
- కాంట్రాక్టుల జోలికి వెళ్లని అధికారులు
- విచ్చలవిడిగా అక్రమ క్వారీలు, బ్లాస్టింగులు

ప్రజాశక్తి - జామి

మండల కేంద్రమైన జామి గ్రామ పంచాయతీలో సుమారుగా పదికి పైగా మైనింగ్ లీజులతో క్వారీలు నిర్వహించే వారు. ఇందులో పేదలు, దళితులు నిర్వహించే సొసైటీల క్వారీలు కూడా ఉన్నాయి. అయితే గత ప్రభుత్వం లోనే ఇసి (ఎన్విరాల్ మెంట్ క్లియరెన్స్) లేక సగానికి పైగా మూత బడ్డాయి. మూత బడిన క్వారీలనే జాతీయ రహదారి నిర్మాణ సంస్థ మైన్స్ అధికారులను మేనేజ్ చేసుకుని బినామీల పేరిట మైనింగ్ చేస్తుంది. ప్రాజెక్ట్ పూర్తయిపోయినా, ఆసంస్థ మైనింగ్ తవ్వకాలు ఆపకపోవడం విశేషం. ఇక్కడ మరో విచిత్రం ఏమంటే జాతీయ రహదారిని అనుకుని ఉన్న క్వారీలు, క్రషర్లు కూడా అధికారుల సాయంతో యథేచ్ఛగా నడుస్తున్నాయి. కానీ దళిత సొసైటీ పేరిట గత దశబ్ద కాలంగా 100 కుటుంబాలకు పైగా క్వారీ పనులు చేసుకొని జీవించేవారు. జాతీయ రహదారి నెపంతో పేదలు బతికే వీటిపైన మైన్స్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. దీంతో ఏళ్లగా ఉపాధినిచ్చే క్వారీలను వదిలేసి దళిత కుటుంబాలు వలస పోతున్న పరిస్థితి నెలకొంది.

బ్లాస్టింగుల భాగోతం

ఎక్స్‌ప్లోజివ్ మైనింగ్ బ్లాస్టింగులు అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నా, పట్టించుకునే వారు లేకపోవడం గమనార్హం. ఇటీవల ఆర్‌టిఐపై స్థానిక గిరిజనులు క్వారీ పేలుళ్ళ నియంత్రణ బాధ్యత ఎవరన్నదానిపై వివరాలు కోరినప్పటికీ జిల్లా కలెక్టర్ కార్యాలయం, పోలీసు, మైన్స్ శాఖలు విచిత్రమైన సమాధానాలు పంపడం అధికార నిర్లక్ష్య ధోరణికి అద్దం పడుతోంది. కలెక్టర్, ఎస్‌పి కార్యాలయాల నుంచి సమాధానాలు రాకపోగా, మైనింగ్ శాఖ అధికారులు రెవిన్యూ, పోలీసులను అడగాలని ఉచిత సలహాలు ఇచ్చారు.

దళితులమని చులకన

తాతల తండ్రుల నుంచి క్వారీలే జీవనాధారం. జాతీయ రహదారి రావడంతో సొసైటీ పేరున మాకున్న క్వారీ అనుమతులు రెన్యువల్ కావడం లేదు. కానీ ఎటువంటి అనుమతులు లేని బడా బాబులు మాత్రం దర్జాగా మైనింగ్ చేస్తున్నారు. ఇదెక్కడి న్యాయం?

- బోని తాతారావు, దళిత, క్వారీ కార్మికుడు

కార్పొరేట్లకు ఊడిగం

సామాన్యులు ఆధారపడే సొసైటీలకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వాలి. కానీ కార్పొరేట్ వ్యాపారులకు మాత్రం మినహా యింపులు ఇచ్చి, క్వారీలు అడ్డగోలుగా అప్పగిస్తున్నారు. ఇప్పటికైనా మాలాంటి పేద కుటుంబాల పట్ల ప్రభుత్వం దయ చూపాలి.

- మోయి లక్ష్మణ, క్వారీ కార్మికుడు


విజయనగరంలోని వైఎస్ఆర్ కాలనీలో హోలీ సంబరాలు చేసుకుంటున్న చిన్నారులు

ఘనంగా హోలీ వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం, చీపురుపల్లి

జిల్లాలో శుక్రవారం హోలీ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. చిన్నా, పెద్దా అని తేడా లేకుండా అందరూ సంబరాలు చేసుకున్నారు. విజయనగరం, చీపురుపల్లి, బొబ్బిలిలో మార్వాడీలు, ఒడిశాకు చెందిన కొన్ని కుటుంబాలు ఎక్కువగా ఉన్న చోట ఉదయం నుంచే తమ సంప్రదాయాలతో హోలీ పండగను వైభవంగా నిర్వహించారు. విజయనగరంలోని అన్ని ప్రాంతాల్లోనూ చిన్నారులు, పెద్దలు రంగులు పూసుకొని ఉత్సాహంగా గడిపారు.


చీపురుపల్లిలోని దేవాంగుల వీధిలో హోలీ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

ప్రయివేటు ఆస్పత్రి నిర్వాకం

యువకుడి ప్రాణం మీదకొచ్చింది

- ప్రమాదం జరిగి వారమైనా పట్టించుకోని పోలీసులు
- ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న యువకుడు

ప్రజాశక్తి - జామి

కొందరి ఆకతాయుల నిర్లక్ష్యం... ఓ ప్రయివేటు అస్పత్రి నిర్వాకం...పోలీసుల విధి నిర్వహణ లోపం వెరసి ఓ అమాయక యువకుడి ప్రాణాల మీదకు తెచ్చాయి. నిరుపేద కుటుంబానికి కంటి మీద కునుకు లేకుండా చేశాయి. వివరాల్లోకి వెళితే...


చికిత్స పొందుతున్న యువకుడు

జామి మండల కేంద్రానికి చెందిన బత్తుల గౌతం (21) ఎల్లారమ్మ జాతర రోజున రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. జామి దుర్గామాత గుడి సమీపంలోబైకుపై వెళుతున్న గౌతంను ఎదురుగా వస్తున్న మరో బైకు బలంగా ఢీకొంది. దీంతో గాయపడిన గౌతంను కుటుంబ సభ్యులు జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. కాలు విరిగినట్లు నిర్ధారించిన ప్రభుత్వ వైద్యులు ఇక్కడ ఆపరేషన్ చేయాలంటే ఐదు, ఆరు రోజులు పడుతుంది మీ ఇష్టం అని సెలవిచ్చారు. గత్యంతరం లేక నగరంలోని ఓ ప్రయివేటు అస్పత్రికి అదే రోజు రాత్రి తరలించారు. ఆపరేషన్ చేస్తామని, అంతా ఆరోగ్య శ్రీ తోనే అయిపోతుందని చెప్పారు. 9 తేదీ మధ్యాహ్నం ఆపరేషన్ గదిలోకి వెళ్లిన గౌతంను అపస్మారక స్థితిలో బయటకు తీసుకురావడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. గౌతం పరిస్థితిపై వైద్యులను ఆరా తీయగా, మత్తు ఎక్కువైందని, తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పుకొచ్చారు. పరిస్థితి విషమించడంతో అక్కడ నుంచి విశాఖపట్నం తరలించారు. గౌతం ఆరోగ్య పరిస్థితి పూర్తిగా ప్రాణాల మీదకు వచ్చిందని అక్కడ వైద్యులు చెప్పడం కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

పోలీసుల నిర్లక్ష్యం

ఈనెల 7న రోడ్డు ప్రమాదం జరిగితే, ఇప్పటి వరకు ప్రమాదానికి కారణమైన బైక్‌ను పోలీసులు పట్టుకోపోవడం, కేసు నమోదు చేయకపోవడం గమనార్హం. విజయనగరం ప్రభుత్వ అస్పత్రికి వెళితే... ఇక్కడ సమయం పడుతుందని గౌతంను పంపేయడంతో ప్రయివేటు అస్పత్రుల దోపిడీకి ఉతం ఇచ్చినట్లు అయ్యింది. పోనీ అక్కడైనా సరైన వైద్యం అందించారంటే, వారి నిర్లక్ష్యమే ప్రాణాల మీదకు తెచ్చిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఎస్ఐ వీరజనార్ధన్‌ను ప్రజాశక్తి వివరణ కోరగా, ప్రమాదం జరిగిన వెంటనే బాధితులు సరైన సమాచారం ఇవ్వలేదని, అందుకే కేసు నమోదు చేయడంలో జాప్యం నెలకొందని చెప్పారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు గౌతం పరిస్థితిపై విచారించి, ప్రాణాలు కాపాడాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

లక్ష్యం.. సగం కూడా

- 50 శాతం దాటని పన్నులు వసూలు
- 15 రోజుల్లో శత శాతం సాధ్యమయ్యేనా?


పన్నులు వసూలు చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం నగర పాలక సంస్థ అధికారులు, రెవెన్యూ విభాగం సిబ్బంది మార్చి నెలాఖరు నాటికి శత శాతం పన్నులు వసూలు చేస్తారా అంటే చెప్పలేని పరిస్థితి నెలకొంది. మార్చి నెలాఖరు నాటికి శత శాతం పన్నులు వసూలు చేయాలని కమిషనర్ నల్లనయ్య ఆదేశించినా ఇప్పటివరకు 50శాతం కూడా దాటలేదు. ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరో 15 రోజులు మాత్రమే ఉంది. ఈనేపథ్యంలో వందశాతం పన్నుల లక్ష్యం చేరుకునేందుకు సిబ్బంది నానా తంటాలు పడుతున్నారు.

నగర పాలక సంస్థలో మొత్తంగా రూ.52.30కోట్లు బకాయిలతో కలుపుకొని ఈ ఏడాది పన్నులు వసూలు చేయాల్సి ఉంది.మార్చి 11వ తేదీ నాటికి రూ.25.57 కోట్లు మాత్రమే వసూలైంది. అంటే కేవలం 49శాతం మాత్రమే వసూలు అయ్యింది. 11 నెలలు పాటు 50శాతం మాత్రమే వసూలు చేసిన అధికారులు ఇంకా 15రోజుల్లో మిగతా 50శాతం ఎలా వసూలు చేస్తారో వారికి తెలియాలి. వాస్తవానికి ప్రతి ఏడాది నగర పాలక సంస్థకు రావాల్సిన పన్నులు డిమాండ్ 31.83కోట్లు కాగా, ఇందులో 21.49 కోట్లు వసూలైంది. పాత బకాయిలు రూ.21 కోట్లు ఉంటే అందులో కేవలం రూ.4 కోట్లు మాత్రమే వచ్చింది. ఇంకా పాత మొండి బకాయిలు సుమారుగా రూ.17 కోట్లు పైన రావాల్సి ఉంది. మరో వైపు ప్రభుత్వ కార్యాలయాల నుంచి రావాల్సిన పన్ను బకాయిలు రూ.33.55 కోట్లు రావల్సి ఉండగా కేవలం కోటి ఆరు లక్షలు మాత్రమే మొన్నటికి వసూలైంది.

సిబ్బంది ఉన్నా పురోగతి లేదు

గత ఐదేళ్ల కితం వరకు కేవలం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు మాత్రమే పన్నులు వసూలు చేసేవారు. అప్పుడు ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి 70 శాతం వరకు వసూలు అయ్యేది. ప్రస్తుతం గత ప్రభుత్వం నియమించిన సచివాలయం వ్యవస్థ వచ్చిన తర్వాత రెవెన్యూ కార్యదర్శులు 59మంది అన్ని వార్డుల్లో ఉన్నారు. కానీ పురోగతి మాత్రం పన్నులు వసూళ్లలో కనిపించడం లేదు. వాస్తవానికి ప్రతి రెండు అర్ధ సంవత్సరాల్లో పన్నులు వసూలుపై దృష్టి సారిస్తే ఈ పరిస్థితి వచ్చేది కాదు. ఈ పరిస్థితి మారితే తప్ప శత శాతం పన్నులు వసూలు సాధ్యం కాదు.

పాలకవర్గం సహకారం శూన్యం

మరో వైపు నగర పాలక సంస్థలో డబ్బులు ఉన్నాయంటే ఏదో ఒక అభివృద్ధి కార్యక్రమాలు పేరు చెప్పి వాటిని వాడుకునేందుకు ముందుకు వచ్చే పాలకులు పన్నులు వసూలు చేయించడంలో సహకారం మాత్రం ఉండటం లేదు. అధిక శాతం వ్యాపారులు, గృహ సముదాయాలు వారు చెల్లించాల్సి ఉంటుంది. ప్రధానంగా గృహ సముదాయాలు, ప్రభుత్వ కార్యాలయాల నుంచి బకాయిలు పేరుకుపోతున్నాయి. వీటితో పాటు రాజకీయ నాయకుల సిఫార్సులు కూడా మొండి బకాయిలు పేరుకోపోవడానికి కారణంగా తెలుస్తోంది. వార్డుల్లో ఉన్న ప్రజాప్రతినిధులు దృష్టి సారిస్తే కనీసం 80 నుంచి 90 శాతం వసూలు అయ్యేందుకు వీలుంటుందనే చర్చ జరుగుతోంది.

సీనియారిటీ జాబితాలో లోపాలను సరిచేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీల షెడ్యూల్లో వున్న లోపాలను విద్యాశాఖ అధికారులు సరి చేయాలని ఎస్‌టియు నాయకులు ఆశాఖ ఆర్‌జెడి కె.విజయభాస్కర్‌కు, డిఇఒ మాణిక్యం నాయుడుకు వినతి అందజేశారు. సీనియారిటీ జాబితాలను మెరిట్ కమ్ రోస్టర్ లిస్ట్ ఆధారంగా చేయాలని, తరగతులు, మ్యాపింగ్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎస్‌ఎంసి కమిటీ అభిప్రాయాలను పరిగణలోనికి తీసి కోవాలని, బకాయి ఉన్న పాఠశాలల నిర్వహణ నిధులను చెల్లించాలని కోరారు. గిరిశిఖర ప్రాంతాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు స్పెషల్ పాయింట్స్ ఇవ్వాలని, పెండింగ్ లో ఉన్న ఆర్థిక బకాయిలు చెల్లించాలని కోరారు. వినతినిచ్చిన వారిలో ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు, కె.జోగారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చిప్పాడ సూరిబాబు, రాష్ట్ర కౌన్సిలర్ ఎం. మురళీ, జిల్లా ఉపాధ్యక్షులు టి.నాగేశ్వరరావు, ఎస్. బంగారయ్య, జిల్లా కార్యదర్శులు పి.రాంబాబు, జిఎస్ఎ నాయుడు ఉన్నారు.

ఘనంగా డోలయాత్ర

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలో శుక్రవారం డోలయాత్ర ఘనంగా నిర్వహించారు. శ్రీవేణుగోపాల స్వామి ఆలయం నుంచి స్వామివారిని డోల మండపానికి ఊరేగింపుగా తీసుకుని వచ్చి మండపంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని ఎమ్మెల్యే బేబినాయన దర్శించుకుని పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. డోలయాత్రకు పట్టణం, పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై పూజలు చేశారు.

సమస్యలు తెలుసుకుంటూ.. చైతన్యం చేస్తూ

కొనసాగుతున్న సిపిఎం ప్రజా చైతన్య యాత్ర



కొత్తవలస.. ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు అప్పారావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమస్యలను తెలుసుకుంటూ, వాటిపై ప్రజలను చైతన్యం చేస్తూ ముందుకు సాగింది సిపిఎం ప్రజా చైతన్య యాత్ర. సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గమని, అందుకు అంతా కలిసి రావాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. నగరంలోని గురజాడ నగర్‌లో నివాసం ఉంటున్న పేదలకు తాగునీరు, కరెంట్, రోడ్లు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర సందర్భంగా శుక్రవారం గురజాడ నగర్‌లో జరిగిన సభ లో ఆయన మాట్లాడుతూ పేదలు నివసించే ప్రాంతాల్లో జీవో నెంబరు 30ను పక్కగా అమలు చేసి, నివాసం ఉన్నచోట రెగ్యులర్ చేసి న్యాయం చేయాలని కోరారు. మురికి వాడలలో నివాసం ఉంటున్న పేదలకు డ్రైనేజీ, సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.రమణమ్మ, నగర నాయకులు రంభ శ్రీనివాసరావు, బండారు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఉపాధి పనులు కల్పించాలి

మెంటాడ : అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పనులు కల్పించాలని సిపిఎం మండల కార్యదర్శి రాకోటి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. శుక్రవారం మెంటాడలో ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ఉపాధి పని ప్రాంతాల్లో పర్యటించి, కూలీల సమస్యలు తెలుసుకున్నారు. ఉపాధి పని అందరికీ కల్పించకపోవడంతో వలసలు పోతున్నారని, కూలి గిట్టుబాటు కావడం లేదని, భూమి పదునులేక చంపావతి నదిలో నీటిని తెచ్చుకుని తడుపుకుంటూ పనులు చేస్తున్నామని కూలీలు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పని ప్రాంతాల్లో సౌకర్యాలు కల్పించాలని డిమాండ్‌చేశారు. కూలి గిట్టుబాటు అయ్యేలా చూడాలన్నారు. సమస్యలపై ఈ నెల 17న కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జట్లయ్య, పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

కరెంటు కనెక్షన్ తొలగిస్తామంటున్నారు

పూసపాటిరేగ : గతంలో వినియోగించిన విద్యుత్తుకు ఇప్పుడు బిల్లులు కట్టాలంటున్నారని, లేకుంటే కరెంటు కనెక్షన్ తొలగిస్తామని బెదిరిస్తున్నారని దళితులు సిపిఎం బృందం వద్ద ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా మండలంలోని కొవ్వాడ దళితకాలనీలో శుక్రవారం సిపిఎం నాయకులు బచ్చల సూర్యనారాయణ పర్యటించారు. ఈ సందర్భంగా దళితులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. రూ.7 వేల నుంచి సుమారు రూ.50 వేల వరకు బిల్లులు వచ్చాయని వాపోయారు. ఆ బిల్లులు కట్టలేక ఇబ్బందులు పడుతున్న సమయంలో విద్యుత్తు శాఖ అధికారులు వచ్చి బిల్లు చెల్లించకపోతే మీటరు కనెక్షన్ తొలగిస్తామని చెప్పి బెదిరిస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దళితులపై విద్యుత్తు ఛార్జీల భారాన్ని వేయడాన్ని ఖండించారు. 200 యూనిట్ల వరకు ఉచితంగా కరెంటు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం వారిని మోసగించిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉపాధి హామీ కూలీలకు సుమారు ఆరు వారాల బిల్లులు బకాయిలు ఉన్నాయని, వెంటనే చెల్లించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో దళితులు డి.అప్పారావు, బడి నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.



పూసపాటిరేగ.. దళితులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు సూర్యనారాయణ



మెంటాడ.. నేల పదును లేకపోవడంతో చంపావతి నది నుంచి నీటిని తీసుకొచ్చి తడుపుతున్న ఉపాధి కూలీలు, పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు రాములు

ఆ భూములకు పట్టాలివ్వాలి

కొత్తవలస : సుమారు 80 ఏళ్ల నుంచి సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలని సిపిఎం జిల్లా నాయకులు గాడి అప్పారావు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా శుక్రవారం మండలంలోని కొత్తసుంకరపాలెం, పాతసుంకరపాలెం గ్రామాల్లో ఆయన పర్యటించి, ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి సాగు చేస్తున్న భూములకు నేటికీ పట్టాలు గాని, భూహక్కు గాని కల్పించక పోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పట్టాదారు పాసు పుస్తకాలు, భూహక్కు, రైతుభరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

గిరిజనులను పట్టించుకోని పాలకులు

వేపాడ : పెదక్రిష్ణరాజపురం పంచాయతీ గదబవలస గిరిజనులను పాలకులు పట్టించుకోవడం లేదని సిపిఎం జిల్లా నాయకులు చల్లా జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా గురు, శుక్రవారాల్లో ఆయన గదబవలసలో పర్యటించి, గిరిజనులతో మాట్లాడారు. గ్రామంలోని 35 కుటుంబాలుంటే, ఏ ఒక్కరికీ సెంటు భూమిపై హక్కులు లేవని ఆయన తెలిపారు. ఏ ప్రభుత్వం కూడా పట్టా ఇవ్వకపోవడం చూస్తే అమాయక గిరిజనులపై పాలకులకు ఉన్న శ్రద్ధ ఏపాటిదో అర్థమవుతోందన్నారు. పట్టాలు లేకపోవడంతో రైతు భరోసా, ప్రభుత్వ పథకాలు, రుణాలు అందడం లేదన్నారు. వెంటనే వారికి పట్టాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వార్డు మెంబర్, గేదల చిన్నయ్య, కుమ్మరి లక్ష్మణరావు, నాగేష్, తదితరులు పాల్గొన్నారు.



జాకేరు నుంచి వేపాడ వెళ్లే రూట్‌ను పరిశీలిస్తున్న ఆర్‌టిసి అధికారులు

బడిబస్సుకు లైన్ క్లియర్

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం బడిబస్సుకు మార్గం సుగమమైంది. శృంగవరపుకోట ఆర్‌టిసి డిపో నుంచి పదో తరగతి విద్యార్థులకు బడిబస్సు సౌకర్యం కల్పించాలని సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు.. ఇటీవల పిజిఆర్‌ఎస్‌లో కలెక్టర్‌కు వినతి అందించారు. వెంటనే కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ స్పందించి, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో శృంగవరపుకోట ఆర్‌టిసి డిపో మేనేజర్ కె.రమేష్, సూపరింటెండెంట్ వెంకటరావు, గ్యారేజీ ఇన్‌ఛార్జి సత్యనారాయణ, సెక్యూరిటీ ఇన్‌ఛార్జి నారాయణ, సూపర్‌వైజర్లు బడిబస్సు నడిపేందుకు జాకేరు నుంచి వేపాడ మండల కేంద్రానికి వెళ్లే మార్గాన్ని శుక్రవారం పరిశీలించారు. చిన్న లోపాలున్నాయని, వాటిని సరిచేయాలని డిపో మేనేజర్ రమేష్ చెప్పారు. 17 నుంచి బస్సు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

జ్యూట్‌మిల్లు వెంటనే నడపాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

జ్యూట్‌మిల్లు వెంటనే తిప్పి కార్మికులకు ఉపాధి కల్పించాలని జ్యూట్‌మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మొయిద జంక్షన్, జరజాపుపేట గ్రామాల్లో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ మిల్లు తిప్పకుండా జ్యూట్ యాజమాన్యం నిర్వహణ పేరిట కాలయాపన చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జెసిఎల్ వద్ద ఒప్పందం కుదుర్చుకుని రెండు వారాలు గడుస్తున్నా జ్యూట్‌మిల్లు నడపకపోవడం దారుణమన్నారు. సమావేశంలో కార్మికులు కె.పద్మనాభం, ఎస్.అప్పారావు, ఎం.కృష్ణ, బి.రామకృష్ణ, సాధుబాబు, తదితరులు పాల్గొన్నారు.



రైతుబజారును తనిఖీ చేస్తున్న డైరెక్టర్ విజయ సునీత

రైతుబజార్లు, మార్కెట్ యార్డుల్లో తనిఖీ

ప్రజాశక్తి-విజయనగరంకోట

వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత శుక్రవారం విజయనగరంలోని మూడు రైతు బజార్లను, మార్కెట్ కమిటీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా, మార్కెటింగ్ శాఖ కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించి, మార్కెట్లలో వ్యవస్థాపిత సదుపాయాలను పరిశీలించారు. రైతులకు అందుతున్న సౌకర్యాలు, కూరగాయల ధరలు, మార్కెట్ కమిటీల విధానం గురించి అధికారులతో చర్చించారు. మార్కెట్ ప్రాంతాలలో పరిశుభ్రత, డ్వాక్రా షాపులు, విక్రయించే ఉత్పత్తుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ పి. సుధాకర్, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ కిరణ్, జిల్లా వ్యవసాయ వాణిజ్య మరియు మార్కెటింగ్ అధికారి (డాట్మో) బి. రవి కిరణ్‌తో పాటు మార్కెటింగ్ శాఖ ఇంజనీరింగ్ విభాగం ఎస్ఇ, ఇఇ, డిఇ పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ అవార్డులకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-రామభద్రపురం

మండల పరిధిలోని కొట్టక్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఇన్‌స్పైర్ అవార్డులకు ఎంపికయ్యారు. 2024-25 విద్యా సంవత్సరంలో పాఠశాల స్థాయిలో 4 ప్రాజెక్టుల కోసం నలుగురు విద్యార్థినులు ఎంపికైనట్టు కోచ్ షరీఫ్ తెలిపారు. వీటిలో మల్టీపర్పస్ ల్యాండ్ ఎప్రోచ్, స్మార్ట్ రోడ్ సేఫ్టీ సిస్టమ్, స్మార్ట్ ఎసిస్టివ్ గ్లో ఫర్ ది విజువల్లీ ఇంపయర్డ్, విండ్ డర్బో ఏరో డైనమిక్ వెహికల్ తదితర ప్రాజెక్టులకు ఏడో తరగతికి చెందిన అంబటి కౌశల్య, 9వ తరగతికి చెందిన వంగపండు శ్రీగ్రీష్మ, పాసల ధరణి,బియ్యపు సింధుజాలు ఎంపికయ్యారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని కల్పించేందుకు, విజ్ఞానశాస్త్రం పట్ల పూర్తి అవగాహన పెంచుకోవడానికి ఎంతోగానో ఉపయోగపడతాయని పాఠశాల హెచ్‌ఎం డాక్టర్ రావాడ భాస్కరరావు తెలిపారు. ఈ సందర్భంగా కోచ్,ఉపాధ్యాయుడు షరీఫ్ విద్యార్థులను అభినందించారు.

రైతుల బీమా పరిహారం ఏమైంది?

ప్రజాశక్తి-బొండపల్లి

రైతులకు చెల్లించాల్సిన బీమా పరిహారం ఏమైందని మండల పరిషత్తు సమావేశంలో సభ్యులు అధికారులను ప్రశ్నించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి చల్ల చలంనాయుడు అధ్యక్షతన మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎం.కొత్తవలస, బి.రాజేరు సర్పంచులు కర్రోతు శ్రీనివాసరావు, ఈదుబిల్లి కృష్ణ మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులకు బీమా పరిహారం అందలేదన్నారు. ఈ విషయంలో అధికారులు చొరవ తీసుకోవాలని వ్యవసాయ అధికారి మల్లికార్జునరావు దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అపరాల పంట కోత ప్రయోగాలు నిర్వహించామని, వాటి ప్రకారమే బీమా పరిహారం వర్తిస్తుందని ఎఒ తెలిపారు. యాంత్రీకరణ పరికరాలు రైతులకు అందించేటప్పుడు అర్హతను చూసి ఇవ్వాలని వైస్ ఎంపిపి గొండెల ఈశ్వర రావు, సర్పంచ్ కర్రోతు శ్రీనివాసరావు, అంబటివలస ఎంపిటిసి తాళ్ళపూడి అప్పలనాయుడు అధికారులను కోరారు. గ్రామాలలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల విషయంలో అధికారులు ప్రోటోకాల్ తప్పక పాటించాలని, లేకుంటే కోర్టును ఆశ్రయించాల్సి వస్తుందని సర్పంచులు ఈదుబిల్లి కృష్ణ, కర్రోతు శ్రీనివాసరావు, బుంగ దేవుడు అధికారులకు స్పష్టం చేశారు. ఈ విషయమై ఎంపిపి చల్ల చలంనాయుడు జోక్యం చేసుకుంటూ, ప్రోటోకాల్ విషయంలో తీర్మానాన్ని జిల్లా ఉన్నతాధికారులకు పంపాలని ఎంపిడిఒ జి.గిరిబాలకు సూచించారు.

ఈ సమావేశంలో తహశీల్దార్ డి.రాజేశ్వరరావు, ఇఒపిఆర్‌డి రఘుపతిరావు, విద్యుత్తు శాఖ ఎఇ జి.శంకర్, వైస్ ఎంపిపి మీసాల సరోజినీ, సర్పంచులు మునకాల పైడిపు నాయుడు, లండ నారాయణమ్మ, నెట్టి ఏసురత్నం, ఎంపిటిసిలు బండారు శ్రీనివాసరావు, పడాల సుజాత, కొమ్మ నాగమణి, సుంకరి కృష్ణవేణి, మోపాడ సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి చలంనాయుడు

వేగంగా పి4 సర్వే

ప్రజాశక్తి-రామభద్రపురం

మండలంలో పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్టనర్ షిప్ (పి-4) సర్వే త్వరితగతిన కొనసాగుతోంది. అట్టడుగున ఉన్న పేదలను గుర్తించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ సర్వేను నిర్వహిస్తున్నట్లు చెబుతోంది. సర్వేసిబ్బంది ప్రతీ ఇంటికి వెళ్లి వారికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని రికార్డు చేస్తున్నారు. సర్వేలో అన్ని శాఖల అధికారులు పాల్గొనడమే కాకుండా కుటుంబ సభ్యుల వివరాలతో పాటు వారి ఆర్థిక స్థితిగతులపై కూడా క్షుణ్ణంగా సర్వే చేస్తున్నారు. ఇప్పటి వరకు మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో 80 శాతం సర్వే జరిగింది. ఈ నెల 18వ తేదీలోగా ఈ సర్వే పూర్తిచేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

మహిళలకు 'శక్తి' భరోసా



శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసి చూపిస్తున్న విద్యార్థినులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

మహిళలకు శక్తి మొబైల్ యాప్‌తో భరోసా లభిస్తుందని ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. మహిళల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేకంగా శక్తి మొబైల్ యాప్ రూపొందించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా ఐదు శక్తి బృందాలను జిల్లాలో ఏర్పాటు చేశారు. ఈ బృందాలు శుక్రవారం నుంచే క్షేత్రస్థాయిలో పనిచేయడం ప్రారంభించాయి. ఈ బృందాలు ఎస్ఐల ఆధ్వర్యంలో మఫ్టీలో వివిధ ప్రాంతాలను సందర్శిస్తున్నాయి. జిల్లాలోని ఆర్‌టిసి కాంప్లెక్సులు, బస్టాపులు, రైల్వేస్టేషన్లు, ముఖ్య కూడళ్లు, కళాశాలలు సందర్శించి, మహిళలు, విద్యార్థినులకు శక్తి మొబైల్ యాప్ పట్ల అవగాహన కల్పిస్తున్నాయి. మొబైల్‌లో యాప్ డౌన్‌లోడ్ చేయించి, ఎలా వినియోగించాలో సిబ్బంది వివరిస్తున్నారు. మహిళల మొబైల్ ఫోనులో శక్తి యాప్ నిక్షిప్తమై ఉంటే ఆపద సమయాల్లో పోలీసుల సహాయం సులువుగా పొందవచ్చునని చెప్పారు. మహిళలు ఒంటరిగా ప్రయాణించే సమయాల్లో శక్తి యాప్ రక్షణగా నిలుస్తుందన్నారు. కేవలం మొబైల్ ఫోన్ గాలిలో షేక్ చేసినా, వారున్న లొకేషన్, ఆడియో, వీడియో వివరాలు దగ్గరలో ఉన్న పోలీసు స్టేషనుకు చేరుతాయని తెలిపారు. తద్వారా పోలీసులు సకాలంలో స్పందించి, కారకులైన వ్యక్తులపై చర్యలు చేపట్టి, మహిళలకు రక్షణగా నిలిచే అవకాశం ఉంటుందని తెలియజేశారు.

బొబ్బిలి : మహిళల రక్షణకు శక్తి టీమ్‌లు పని చేస్తున్నాయని శక్తి టీమ్ ఎస్ఐ జ్ఞానప్రసాద్ అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్ కూడలిలో శుక్రవారం శక్తి టీమ్ బృందం పర్యటించి శక్తి టీమ్స్ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. శక్తి మొబైల్ యాప్‌ను విద్యార్థినుల మొబైల్స్‌లో ఇన్‌స్టాల్ చేసి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా జ్ఞానప్రసాద్ మాట్లాడుతూ బాలికలు, మహిళల రక్షణపై శక్తి టీమ్ నిరంతరం పర్యవేక్షణ చేస్తుందన్నారు. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ నివారణకు మఫ్టీలో శక్తి టీమ్ పర్యటిస్తుందని చెప్పారు. శక్తి టీమ్‌లో తనతో పాలటు ఒక ఎఎస్ఐ, ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు, ఇద్దరు పురుష కానిస్టేబుళ్లు ఉన్నట్లు తెలిపారు.



గ్రామ సర్వేయర్ల నూతన కార్యవర్గ సభ్యులు

గ్రామ సర్వేయర్ల జిల్లా కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరం

గ్రామ సర్వేయర్ల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుల ఎన్నిక స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో శుక్రవారం జరిగింది. ఎన్నికలలో స్టేట్ కో-ఆర్డినేటర్‌గా శరత్, జిల్లా అధ్యక్షులుగా కాశీనాయుడు, కార్యదర్శిగా దుర్గా మదీనా, జిల్లా స్పోర్ట్స్ సెక్రెటరీగా జగదీష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా ఉపాధ్యక్షులుగా రమాదేవి, జాయింట్ సెక్రటరీగా లక్ష్మి ప్రసాద్, కోశాధికారిగా అజయ్ కుమార్, జిల్లా ఉమెన్ వింగ్ సెక్రటరీ గా యెర్నా సాయి ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యవర్గ సభ్యులకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి.మధుబాబు నియామక పత్రాలను అందజేస్తూ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల నాయకులు, విజయనగరం జిల్లా సర్వే సిబ్బంది పాల్గొన్నారు

ప్లాస్టిక్ నియంత్రణకు సహకరించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్లాస్టిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య కోరారు. ముఖ్యంగా సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధానికి అందరూ కృషి చేయాలన్నారు. ప్లాస్టిక్ నియంత్రణా చర్యల్లో భాగంగా శుక్రవారం ఆయన ఆదేశాలతో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, పారిశుధ్య పర్యవేక్షకులతో కలిసి నగరంలో మార్కెట్ ప్రాంతంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాలపై దృష్టి సారించారు. టిఫిన్ దుకాణాలు, కిరణా దుకాణాలు, ఇతర బడ్డీలను తనిఖీ చేశారు. కొంతమంది సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించడంతో సామాగ్రిని స్వాధీనం చేసుకొని అపరాద రుసుం విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ నల్లనయ్య మాట్లాడుతూ పర్యావరణహితాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణగా ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు పరచాలన్నారు.

అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తం

ప్రజాశక్తి-రామభద్రపురం

రాబోయే వేసవి కాలంలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందని, వీటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బాడంగి ఫైర్ ఆఫీసర్ రామసూర్యారావు సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ముఖ్యంగా వేసవిలో ఎండ తీవ్రతకు తోడు అధికంగా వేడి గాలులు వీచే అవకాశం ఉండడంతో ప్రమాదాలు సంభవిస్తాయని చెప్పారు. గడ్డివాముల చుట్టూ, ఎండిన తోటల్లో గాజుపెంకులు ఉంచరాదని సూచించారు. విద్యుత్తు వైర్ల కింద గడ్డి కుప్పలు వేయరాదని తెలిపారు. గడ్డి తీసుకొని వెళుతున్న ట్రాక్టర్లు, లారీలపై తప్పనిసరిగా టార్పాన్లు కప్పాలని తెలిపారు. ఇళ్ల నిర్మాణంలో ఐఎస్ఐ బ్రాండ్ వైరింగ్ లేకపోతే విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ అయ్యి అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. సమావేశంలో ఆ శాఖ హోంగార్డు రవికుమార్ పాల్గొన్నారు.



హెచ్‌ఎం రమణను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

పెంట హెచ్‌ఎంను సన్మానించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బొబ్బిలి

మండలంలోని పెంట జిల్లా పరిషత్తు పాఠశాల ప్రధానోపాధ్యాయులు చింత రమణను ఎమ్మెల్యే బేబినాయన సన్మానించారు. విద్యార్థులు బాగా చదవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రధానోపాధ్యాయులు స్వీయ క్రమశిక్షణ విధించుకోవడంతో విద్యాశాఖ మంత్రి లోకేష్ అభినందించారు. ఈ సందర్భంగా కోటలో శుక్రవారం రమణను ఎమ్మెల్యే సన్మానించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు పనిచేయాలని కోరారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థలో మార్పులు తెచ్చేందుకు మంత్రి లోకేష్ పని చేస్తున్నారని చెప్పారు. పేద విద్యార్థులకు విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో పెంట గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-బొబ్బిలి

ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను శుక్రవారం స్థానిక కోటలో ఎమ్మెల్యే బేబినాయన లబ్ధిదారులకు అందజేశారు. 11 మందికి మంజూరైన సుమారు రూ.15 లక్షల చెక్కులను పంపిణీ చేశారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

పదో తరగతి విద్యార్థులకు ఉషోదయ యూత్ అసోసియేషన్ పరీక్షల సామగ్రి అందజేసింది. శుక్రవారం జరజాపుపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల వార్షికోత్సవంలో భాగంగా పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్లాంక్, పెన్, పెన్సిల్, స్కేల్, తదితర వస్తువులు అందజేసింది.

వైసిపి మండలాధ్యక్షుల నియామకం

ప్రజాశక్తి-చీపురుపల్లి

వైసిపి చీపురుపల్లి మండల అధ్యక్షులుగా మీసాల వరహాలనాయుడు నియమితులయ్యారు. గతంలో వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, ఇప్పిలి అనంతం మండల అధ్యక్షులుగా పనిచేశారు. ఈ సారి వరహాలనాయుడికి అధ్యక్ష పదవిని పార్టీ అప్పగించింది. వరహాలనాయుడు గతంలో చీపురుపల్లి జెడ్‌పిటిసి సభ్యులు గాను, చీపురుపల్లి ఎఎంసి చైర్మన్‌గాను పని చేశారు. అదే విధంగా చీపురుపల్లి మేజర్ పంచాయితీ సర్పంచ్‌గా ఆయన సతీమణి మీసాల సరోజినిని గెలిపించారు. 2024 ఎన్నికల ముందు ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ సమక్షంలో వైసిపి తీర్థం పుచ్చుకొన్నారు. వరహాలనాయుడు మండల అధ్యక్షులుగా నియామకం కావడం పట్ల ఆ పార్టీ జిల్లా నాయకులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, ఇప్పిలి అనంతం, నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు.



పిన్నింటి తమ్మినాయుడు

డెంకాడ మండల అధ్యక్షులుగా తమ్మినాయుడు

డెంకాడ : వైసిపి డెంకాడ మండల అధ్యక్షులుగా వైస్ ఎంపిపి, చింతలవలసకు చెందిన పిన్నింటి తమ్మినాయుడు నియమితులయ్యారు. గతంలో మండల అధ్యక్షులుగా పని చేసిన బంటుపల్లి వెంకట వాసుదేవరావు జనసేనలో చేరడంతో నూతన అధ్యక్షులుగా తమ్మినాయుడును ఆ పార్టీ అధిష్టానం నియమించింది. ఆయనకు మండలంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. తనను నమ్మి, మండల పగ్గాలు అప్పగించిన వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, మాజీమంత్రి బొత్స సత్యనారాయణకు, జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావుకు, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుకు తమ్మినాయుడు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో వైసిపి అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.



మీసాల వరహాలనాయుడును అభినందిస్తున్న వైసిపి నాయకులు

మూడు బోర్లు ఏర్పాటు

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని లక్ష్మీపురం పంచాయతీలో తాగునీటి ఇబ్బందుల దృష్ట్యా మూడు బోర్లు ఏర్పాటుచేశారు. సర్పంచ్ కెంబూరు తేజ వెంకటేశ్వరరావు, ఎంపిటిసి ప్రతినిధి కెంబూరు అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఆర్‌డబ్ల్యుఎస్ జి.శ్రీచరణ్ శుక్రవారం మూడు తాగునీటి బోర్లు ఏర్పాటు చేశారు. జెడ్‌పి, మండల పరిషత్తు, గ్రామ పంచాయతీ నిధుల నుంచి ఈ బోర్లు తవ్వినట్లు వారు తెలిపారు. వేసవి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి బోర్లు ఏర్పాటు చేయడంతో ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



బోరు తవ్వకాలను పరిశీలిస్తున్న నాయకులు

నాటుసారా నివారణకు పటిష్ట చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలి

నాటుసారా నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని ఎక్సైజ్ సిఐ పి.చిన్నంనాయుడు అన్నారు. నాటుసారా నివారణకు ప్రభుత్వం నిర్వహిస్తున్న నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాలలో పోస్టర్లను అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా నివారణకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుందన్నారు. నాటుసారా తయారు చేసినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాటుసారా నివారణకు సహకరించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.



పోస్టర్లను అతికిస్తున్న ఎక్సైజ్ సిఐ చిన్నంనాయుడు

చికిత్స పొందుతూ యువకుడు మృతి

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలోని ఎ.రావివలస పంచాయతీ అమ్మటం గ్రామానికి చెందిన అక్కరబోయిన అప్పలనాయుడు (22) ఆత్మహత్యకు పాల్పడి, చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. రిసార్టులో పనిచేస్తున్న అప్పలనాయుడుపై యాజమాన్యం సెల్‌ఫోన్ దొంగిలించాడని ఆరోపించింది. దీన్ని అవమానంగా భావించి ఈ నెల 11వ తేదీన గడ్డి మందు తాగి, ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ఒక ప్రయివేట్ హాస్పిటల్ తరలించడంతో అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మరణించాడు. అప్పలనాయుడు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.